క్లుప్తంగా

ఆరోగ్యజాగ్రత్తలు పాటించాలి



వైద్యశిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: శీతాకాలంతో పాటు వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ సూచించారు. గజపతినగరం గ్రామ సచివాలయం-1లో శుక్రవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 54 మందికి వైద్య సిబ్బందితో కలిసి వివిధ వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి వృద్ధులు, గర్భిణులకు వైద్య తనిఖీలు చేశారు.

రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

బొండపల్లి: మార్గశిర బహుళ పంచమి సందర్భంగా దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శివలింగానికి శుక్రవారం రుద్రాభిషేకం చేశారు. అర్చకులు దూసి శ్రీధర్ శర్మ భక్తులతో అమ్మవారికి, శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు.

మానసాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

చీపురుపల్లి: రామలింగాపురం పరిసరాల్లో వెలసిన శ్రీ మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు ఝామున 4 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పూలతో అలంకరించి, అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అమ్మవారికి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

ప్రీమియం చెల్లింపునకు గడువు పెంపు

చీపురుపల్లి: వాతావరణ ఆధారిత పంటల బీమాకు సంబంధించి మామిడితోటలకు బీమా చేసుకునేందుకు ప్రభుత్వం ఈనెల 31 వరకు గడువు పొడిగించిందని హెచ్‌ఓ చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ ఆఫ్ ఇండియా ద్వారా మామిడి పంటకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు రైతులు తమ పరిధిలోని సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

సర్వేలు పక్కాగా చేపట్టాలి



చెల్లాపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

మెరకముడిదాం: గ్రామాల్లో సిటిజన్ మిస్సింగ్ డేటా ఎంట్రీ, స్వామిత్వ మ్యాపింగ్ సర్వే పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ జి.భాస్కరరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని చినబంటుపల్లి, చెల్లాపురం సచివాలయాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం, సర్వేలపై సిబ్బందిని ఆరా తీసి, పలు సూచనలు చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య, వీధిలైట్ల నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. కొంతమంది సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, సిబ్బంది తీరు మార్చుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.విధుల్లో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాల్సి వస్తే మూమెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

అన్నదాతను ఆదుకోవాలి

విజయనగరం ఫూల్‌బాగ్: వర్షాలకు నష్టపోయిన అన్నదాతను ప్రభుత్వమే ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల్లో వరి రైతులు బాగా నష్టపోయారని చెప్పారు. వారందరికీ నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే తడిచిన ధాన్యం కొనుగోలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

అపరాలకు అపారనష్టం

- రైతులకు నిరాశ మిగిల్చిన రబీ అపరాల సాగు
- పెసర,మినప,ఉలవ పంటలకు చేటు చేసిన ఫెంగల్ తుఫాన్, తాజా వర్షాలు
- పురుగు, తెగుళ్ల ఉధృతితో దెబ్బతిన్న పంటలు



చీపురుపల్లిలో చివరదశలో పురుగు ఆశించడంతో దెబ్బతిన్న పెసర పంట

చీపురుపల్లి రూరల్(గరివిడి): రబీ అపరాల సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలింది. పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి కనిపించడం లేదు. ఆరుగాలం శ్రమిం చే రైతన్నలకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టాల పాలవుతున్నాడు. చీపురుపల్లి ,గరివిడి,గుర్ల, మెరకముడిదాం మండలాల్లోని సుమారు 4వేల ఎకరాల మెట్టుభూముల్లో ఈ ఏడాది ఖరీఫ్ వేరుశనగ, మొక్కజొన్న పంటల కోతలు పూర్తయి న తర్వాత రైతులు మినప,పెసర,ఉలవ పంటలను వేశారు. దుక్కులు,విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం వేల రూపాయల పెట్టుబడి పెట్టారు. ప్రారంభంలో వర్షాలు లేకపోవడంతో వ్యవసాయ మోటార్లు ఉన్న రైతులు పంటలకు నీటి తడులు అందించడంతో చేను ఏపుగా పెరిగింది. పంట పూత,కాయదశకు చేరుకున్న సమయంలో ఈనెల ప్రారంభంలో ఫెంగల్ తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు పంటను తెగుళ్లు, పురుగు ఆశించాయి. వీటి నివారణకు రైతులు పురుగు మందులు పిచికారీ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఎంతో కొంత పంట చేతికి అందకపోతుందా అని అనుకు న్న రైతన్నల ఆశలపై తాజాగా మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలు నీళ్లు చల్లాయి. అపరాల పంటలకు ఆరంభ, మధ్యస్థ దశలో వర్షాలు కురిస్తే మేలేనని, పూత దశలో కాయలు కాచిన సమయంలో వర్షాలు కురిస్తే మాత్రం నష్టమేనని రైతులు అంటున్నారు.ప్రారంభంలో పంటలు ఆశాజనకంగా ఉండడంతో ఎకరానికి సుమారు 4 నుంచి 5 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశామని, అకాల వర్షాలు మా అంచనాలను తారుమారు చేశాయని రైతులు వాపోతున్నారు. తాజాగా కురిసిన వర్షాలకు పెసర,మినప, ఉలవ పంటల్లో పురుగు ఉధృతి పెరిగి కాయలు కుళ్లిపోతున్నాయి.

ఆశలు వదులుకున్నాం

ఈ ఏడాది మినప,పెసర పంటలపై పూర్తిగా ఆశలు వదులుకున్నాం. అపరాల పంటలకు ఆరంభంలో వర్షాలు కురిస్తే నష్టం ఉండదు. పూతకు వచ్చి కాయ కాచే సమయానికి ఫెంగల్ తుఫాన్ వల్ల వర్షాలు కురవడంతో పురుగు వ్యాపించి పంటలు నాశనయయ్యాయి. ఇప్పుడు మూడురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఎంతోకొంత మిగిలిన కాపు ఈ వర్షాలకు కుళ్లిపోతుంది. రబీ అపరాల సాగు నిరాశను మిగిల్చింది. – ఎం. వెంకటప్పడు, రైతు, కొండపాలెం, గరివిడి మండలం

ప్రారంభంలోనే పాడవుతున్న పంట



వేపాడలో పెసర పైరులో నిలిచిన వర్షం నీరు

శృంగవరపుకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు అపరాల పంటలకు అపార నష్టాన్ని మిగుల్చుతున్నాయి. పొలాల్లో నీరు చేరి మొక్కలు చివికిపోయి కుళ్లిపోతున్నాయి. పంట ప్రారంభదశలోనే పాడైపోతోంది.అకాల వర్షాల వల్ల రైతులకు కష్టాలే మిగిలాయి. వరి కోతల తర్వాత రైతులకు ఎక్కువ ఖర్చు లేకుండా ఆదాయాన్నిచ్చేవి అపరాలు. ఎస్.కోట నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్ వరి పంట కోతలకు ముందు పొలాల్లో పెసర, మినప విత్తనాలు చల్లారు. కోతలు పూర్తయ్యేసరికి విత్తనాలు బాగా మొలకెత్తాయి. దీంతో ఈ ఏడాది అపరాల సాగు ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావించారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు నిలిచిపోయి మొక్కలు మునిగిపోతుండడంతో అపరాల పైరుపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు.

● సెమీ క్రిస్మస్ వేడుకలు



గరివిడి అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏసును ఆరాధిస్తూ గీతాలు ఆలపించారు. విశాఖపట్నానికి చెందిన పాస్టర్ ఎస్.వరుణ్‌దీపక్ జీసస్ సందేశాన్ని వినిపించారు. ఏసు ప్రభువు మనుషులందరినీ ఒకేలా ప్రేమించేవా రని, శత్రువుని ప్రేమతో జయించే వాడని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ అందరూ క్రీస్తు సూచించిన మార్గంలో నడవాలని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

–చీపురుపల్లిరూరల్(గరివిడి)

● క్షయను అంతం చేద్దాం..



అవగాహనతో క్షయ వ్యాధిని అంతం చేద్దామని, క్షయరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహాయ ,సహకారాలు అందించాలని కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్‌వర్మ కోరారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా దేశపాత్రునిపాలెంలో శుక్రవారం అవగాహన కల్పించారు. పలువురికి ఎక్స్‌రే, కఫం పరీక్షలు చేశారు. దగ్గు, కఫం, ఆయాసం, చాతిలో నొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గడం,కఫంతో రక్తం జీరలు రావడం వంటి లక్షణాలు ఉంటే పీహెచ్‌సీకి వెళ్లి పరీక్ష చేయించుకోవాలన్నారు.వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

– కొత్తవలస

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తా

- జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు 'వలిరెడ్డి'



వలిరెడ్డి శ్రీనివాస నాయుడు

చీపురుపల్లి: జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తనవంతుగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆపార్టీ జిల్లా కార్యదర్శి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు చెప్పారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో జిల్లా ప్రచార విభాగం బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ చేపట్టే ప్రతీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని స్పష్టం చేశారు. అధికార పార్టీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నామని చెప్పారు. ప్రచార విభాగం బాధ్యతలు అప్పగించడంలో తనపై నమ్మకం ఉంచిన శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలకు ధన్యావాదాలు తెలిపారు.

నేడు జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



చీపురుపల్లి: విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సిపి నాయకులు

చీపురుపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆదేశాల మేరకు చీపురుపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని చెప్పారు.వేడుకలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరుకానున్నారని తెలిపారు.ఉదయం 10 గంటలకు కేక్ కటింగ్ ఉంటుందని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం , గుర్ల మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, నాయకులు గిరిడ రాందాసు, కొమ్ము చిరంజీవి, ముల్లు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరులో...

దత్తిరాజేరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ మహదేవ్ ఫణీంద్రుడు నివాసం వద్ద శనివారం నిర్వహించనున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రాతు రాజేశ్వరి, సీనియర్ నాయకులు మంత్రి అప్పలనాయుడు హాజరై కేక్ కట్ చేస్తారని, ఆతర్వాత పలు సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు,కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

హెల్త్ అసిస్టెంట్ల తొలగింపు సరికాదు

బొండపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) రెండు దశాబ్దాలుగా సేవలందించిన మల్టీపర్పస్ హెల్త్‌అసిస్టెంట్లను తొలగించడం సరికాదని దేవుపల్లి,బొండపల్లి పీహెచ్‌సీల సిబ్బంది అన్నారు. మల్టీపర్పస్ హెల్త్‌అసిస్టెంట్లను తొలగిస్తూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. అనంతరం వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ కోవిడ్ సమ యంలో కూడా ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన వారిని ఇలా మధ్యలో ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయ మన్నారు. 20ఏళ్లుగా పనిచేస్తున్న వారిని ఇప్పుడు తొలగిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని, ప్రభుత్వం వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలకు పరిష్కారం

గంట్యాడ: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ పూర్తిస్థాయిలో భూరికార్డులతో సదస్సుకు వస్తున్నామని చెప్పారు. చాలా వరకు భూసమస్యలు సదస్సుల్లోనే పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు.ఎంపీటీసీ పాటుపు రెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు, మండల సర్వేయర్ దాసరి సత్యం, పంచాయతీ కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరావు, వీఆర్‌ఓ శ్రీనివాస్ ,డిజిటల్ అసిస్టెంట్ సంతోష్, మహిళా సంరక్షక కార్యదర్శి నీలిమ పాల్గొన్నారు.

బొండపల్లి మండలంలో..

బొండపల్లి: మండలంలోని చిన్నతామరాపల్లి, జి.పి.అగ్రహారం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వి.రాజేశ్వరరావు రైతుల నుంచి అర్జీలు స్వీరించారు. చిన్నతామరాపల్లి సర్పంచ్ నడుపూరి భాస్కరనాయుడు, వీఆర్‌ఓ గెద్ద నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పి.లింగాలవలసలో..

దత్తిరాజేరు: మండలంలోని పి.లింగాలవలస గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వారసత్వ, భూసరిహద్దులు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు అర్జీలు అందజేశారు.సమగ్ర భూసర్వే డీటీ రత్నకుమారి, రిజిస్ట్రేషన్ల శాఖ సీనియర్ అసిస్టెంట్ మౌనిక పాల్గొన్నారు.

సోంపురంలో..

వేపాడ: మండలంలోని సోంపురంలో తహసీల్దార్ రాములమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తొమ్మిది మంది రైతులు అర్జీలు అందజేశారు. మండల నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, డీటీ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

డోలపేటలో..

గజపతినగరం: మండలంలోని డోలపేట గ్రామంలో తహసీల్దార్ రత్నకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం సభ ఏర్పాటు చేసి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, ఆర్‌ఐ కె.అప్పలరాజు పాల్గొన్నారు.

చినుకు పడితే నరకమే...



ఎస్.కోటలో ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీరు

శృంగవరపుకోట: గాతలు...గోతులు లేని రోడ్ల ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యం అంటూ ఊదరగొడుతున్న ప్రభుత్వ పెద్దలకు స్థానిక జాతీయ రహదారిలో ప్రజల పాట్లు మాత్రం పట్టటం లేదు. అరుకును ఆంధ్రా ఊటీ చేస్తాం..ఎస్.కోట - విశాఖ రోడ్డును జాతీయ రహదారిగా మార్చాం అంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు, అభివృద్ధి అంతా మా హయాంలోనే అంటూ చెబుతున్న స్థానిక టీడీపీ నేతలకు ప్రజల పాట్లు కనిపించడం లేదు. పట్టణంలో ఉన్న విశాఖ-అరుకు రోడ్డు అంతా గాతలు, గోతుల మయమై నరకానికి మార్గంలా మారింది. చినుకు పడిందే తడవుగా వర్షం నీరు ఎక్కడిదక్కడ నిలిచిపోతోంది. 40 అడుగుల వెడల్పు ఉండాల్సిన రోడ్డు రెండు వైపులా అడ్డగోలు ఆక్రమణలకు గురై పాతిక అడుగుల వెడల్పు కూడా లేకుండా పోయింది. దీంతో పాదచారులకు అటూ ఇటూ తప్పుకోవాలన్నా అవకాశం లేదు.వరద నీటిలో వాహనాలు దూసుకుపోతుంటే పాదచారుల ముఖాల మీదకు నీరు తుళ్లినా తుడుచుకుని పోవాల్సిన దుస్థితి.ఈ సమస్యకు తోడు నిత్యం ఆవులు, కుక్కలు, పందులు ప్రధాన రహదారిలోనే తిష్ట వేస్తున్నాయి. దీంతో పట్టణ వాసులు మరింత కష్టాలు పడుతున్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం



లక్కవరపుకోట: గంగుబూడిలో తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న ఏడీఏ విజయ, వ్యవసాయ అధికారులు



వేపాడ: జగ్గయ్యపేటలో తడిసిన వరికుప్పలను పరిశీలిస్తున్న ఏఓ యశ్వంతరావు



గజపతినగరం: ఎం.వెంకటాపురంలో తడిసిన వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ మహారాజన్,తదితరులు



కొత్తవలస: దేశపాత్రునిపాలెం గ్రామంలో తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



గజపతినగరం: పురిటిపెంటలో వరి కుప్పల చుట్టూ చేరిన నీరు



బొండపల్లి: గెట్టుపల్లి వద్ద వరి కుప్పల చుట్టూ వరదనీరు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్నదాతకు తీవ్ర నష్టం మిగిల్చింది. ఖరీఫ్ వరి నాట్లు ఆలస్యంగా వేసిన ప్రాంతాల్లో తాజాగా కోతలు చేశారు. తుఫాన్‌పై మందస్తు సమాచారం లేకపోవడంతో పలు గ్రామాల్లో రైతులు వరి కోతలు చేసి చేనును కుప్పలు పెట్టకుండా పొలాల్లోనే ఉంచడంతో వరి పనలు నీటిలో తేలాడుతున్నాయి. ధాన్యం రంగు మారిపోయి, మొలకలు వస్తున్నాయి.మరోవైపు పొలాల్లో పెట్టిన వరిచేను కుప్పలు తడిసిముద్దవుతున్నాయి. పొలాలు, కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు, బస్తాలపై టార్పాలిన్లు కప్పినా ఏ క్షణంలో వర్షపు నీరు ముంచెత్తుతుందోనన్న బెంగ రైతన్నను వెంటాడుతోంది. అపరాల పంటలు నీటమునిగాయి. వ్యవసాయ,రెవెన్యూ అధికారులు శుక్రవారం గ్రామాల్లో పర్యటించి పంటల సంరక్షణపై సూచనలు చేశారు. తడిసిన వరిపనలపై 5శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకుంటే ధాన్యం రంగుమారదని, మొలకెత్తవని వివరించారు. –సాక్షి నెట్‌వర్క్